క్లుప్తంగా

సరిహద్దు గ్రామాల్లో తనిఖీలు

అశ్వారావుపేటరూరల్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో పోలీసులు సరిహద్దు ప్రాంతాలు, గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. బుధవారం స్థానిక ఎస్సై టి.యయాతి రాజు ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ సరిహద్దు గ్రామాలైన మండలంలోని వాగొడ్డుగూడెం, రామన్నగూడెం, పండువారిగూడెం, నందిపాడు, కుడుములపాడు, గుమ్మడవల్లి, అచ్యుతాపురం, నారంవారిగూడెంతోపాటు వివిధ గ్రామాల్లో పండుగ సందర్భంగా కోడి పందేలు, పేకాట స్థావరాలు ఏర్పాటు చేయకుండా ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పండుగ, సాంప్రదాయం పేరుతో కోడి పందేలు, పేకాట, ఇతర జూద క్రీడలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. సరిహద్దు ప్రాంతాలు, గ్రామాల్లో పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేయడంతోపాటు, ప్రత్యేక పోలీస్ బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ

బూర్గంపాడు: భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థులలో క్రమశిక్షణ, నైతిక విలువలు అలవడుతాయని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు అన్నారు. బూర్గంపాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయురాలు రవిలాదేవి ఆధ్వర్యంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతు స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందిన విద్యార్థులలో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందన్నారు. సేవాభావం, జాతీయ సమైక్యత విద్యార్థులకు అలవడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గైడ్ కెప్టెన్ శివ భాగ్యశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలోని గిరిజన విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయడంతో పాటు భద్రాద్రి కేంద్రంగా కేంద్రంగా గిరిజన యూనివర్సిటీ, మెడికల్, న్యాయ కళాశాలలను ఏర్పాటు చేయాలని పీడీయస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పెద్దింటి రామకృష్ణ, నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఫిబ్రవరి 4, 5 తేదీల్లో భద్రాచలం వేదికగా జరిగే పీడీయస్‌యు రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌కు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ, డివిజన్ కార్యదర్శి మునిగల శివప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీ ఆధ్వర్యంలో ధర్నా

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని జాతీయ రహదారిపై ఉన్న వీధిలైట్లు వెలగించాలని, ఈ దిశగా అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీపార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. చంద్రుగొండ నుంచి అయన్నపాలెం వరకు వీధిలైట్లు వెలగక నెలలు గడుస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని ఎన్డీ జిల్లా నాయకులు ఎస్‌కె.ఉమర్ విమర్శించారు. రాత్రి అయితే చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయని ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో పార్టీ నాయకులు వరికూటి వెంకట్రావ్, పద్దం శ్రీను, వెంకటన్న, పుల్లయ్య, శ్రీనివాసరెడ్డి, బానోత్ భీముడు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహబంధం

కరకగూడెం: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని కరకగూడెం ఎంపీడీఓ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 11వ తేదీ నుంచి మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో నిర్వహించనున్న భద్రాద్రి,ములుగు జిల్లాల స్థాయి 'హజరత్ ఆలీబాబా వాలీబాల్ టోర్నీ' పోస్టర్లను నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం నిర్వాహకులు ఎస్సై రాజేందర్, ఎంఈఓ గడ్డం మంజుల, మాజీ ఎంపీపీ రేగా కాళికాలతో పోస్టర్లను వేర్వేరుగా ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, సమత్ మోతె సెక్రెటరీ విజయ్, స్కూల్ టీచర్ రాధ, హజరత్ ఆలీబాబా కమిటీ సభ్యులు ఫారుక్, రంజిత్, భార్గవ్, మోయిన్, మోబి, అతిక్ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

గుండాల: మండలంలోని ఉపాధ్యాయులు పాఠశాలలకు గైర్హాజరు కాకుండా అంకితభావంతో పనిచేయాలని, విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేయాలని ఎంఈఓ శాంతారావు, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు సూచించారు. బుధవారం మండలంలోని అనంతోగు ఆశ్రమ పాఠశాల నందు టీపీటీఎఫ్ 2025 డైరీ, క్యాలెండర్లను బుధవారం ఆశ్రమ పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల చదువుల విషయంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బానోత్ భోజ్యా, ఈసం, ముత్తయ్య, బిక్షమయ్య, లాలయ్య, రామయ్య, రామకృష్ణ, సంపత్,రాజా, భద్రు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- స్థానికంగా 3,500 ఇళ్లు మంజూరు
- సమస్యల పరిష్కారంలో కొందరు అధికారుల తీరు మారాలి
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



కరకగూడెం: సమీక్ష సమావేశంలో ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనిచేస్తోందని, ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఇందిరమ్మ ఇల్లు నమూనా నిర్మాణానికి ఆయన కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేసి శంకుస్థాపన చేసి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోజే రాష్ట్రంలో ఇల్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకంలో రాష్ట్రంలో ఐదు లక్షల ఇల్లు పేదలకు అందించాలని ధృడ సంకల్పంతో ఉందన్నారు. సంక్రాంతి నుంచి ప్రారంభం కానున్న ఇందిరమ్మ ఇళ్లకు మణుగూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఇందిరమ్మ ఇల్లు మోడల్ హౌస్‌కు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. తన కోటాలో 3,500 ఇళ్లు మంజూరయ్యాయని, అవి సరిపోవని మంత్రి పొంగులేటికి వివరించి కోరడంతో మరో వెయ్యి ఇందిరమ్మ ఇల్లులు కేటాయిస్తామని తెలిపినట్లు వివరించారు.

భవిత సెంటర్ సందర్శన..

అనంతరం తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న భవిత సెంటర్‌ను ఎమ్మెల్యే పాయం సందర్శించారు. దివ్యాంగులకు అందుతున్న విద్యకు సంబంధించిన విషయాలు, సమస్యలు ప్రత్యేక ఉపాధ్యాయురాలు నాగశ్రీని అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, మున్సిపాలిటీ ఏఈ సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్, నాయకులు కూచిపూడి బాబు, సౌజన్య, గాండ్ల సురేశ్, కుర్రం రవి, రహీం నాయకులు పాల్గొన్నారు.

కరకగూడెం మండలంలో పర్యటన

కరకగూడెం: ప్రజలకు జవాబుదారీగా ఉంటూ ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేయడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.ఈ మేరకు ఆయన బుధవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత 20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వెంకటాపురం గ్రామ పంచాయతీ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా క్షేత్రస్థాయి సమస్యలపై ఆరా తీశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొన్ని శాఖల అధికారులు తీరు మార్చుకోవాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం 4లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసి, గ్రామంలో నూతనంగా నిర్మించిన మావురమ్మ తల్లి గుడిని సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగ ప్రసాద్, ఎంపీడీఓ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, మాజీ సర్పంచ్‌లు పోలెబోయిన శ్రీవాణి,తోలెం నాగేశ్వరరావు, పాపమ్మ, నాయకులు ఎర్ర సురేష్, జలగం కృష్ణ, మధు పలు శాఖల అధికారులు సిబ్బంది,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణావతారంలో పర్ణశాల రాముడు



శ్రీకృష్ణావతారంలో రామయ్య

దుమ్ముగూడెం: పర్ణశాల సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా 9వ రోజు బుధవారం రామయ్యను శ్రీ కృష్ణావతారంలో ఆలయ అర్చకులు అలంకరించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలను, అభిషేకాలను నిర్వహించిన అర్చకులు అనంతరం స్వామి వారిని శ్రీ కృష్ణావతారంలో అలంకరించారు. ఈ అవతారంలో దేవకీ వసుదేవులకు అష్టమ సంతానంగా అవతరించి, దుష్టులైన కంసుడు, నరకాసురుడు, శిశుపాలుడు మొదలైన వారిని వధించి, ధర్మవర్తనులైన పాండవుల పక్షం వహించినట్లు అర్చకులు తెలిపారు. కురుక్షేత్ర సంగ్రామంలో ఉపనిషత్తుల సారాంశమైన భగవద్గీతను అర్జునునికి బోధించి మానవ ఆదర్శాలను ధర్మాన్ని స్థాపించిన శ్రీ మన్నారాయణుని పరిపూర్ణ అవతారం శ్రీ కృష్ణావతారంగా అభివర్ణించారు. చంద్రగ్రహ బాధలున్నవారు ఈ అవతారాన్ని దర్శించడం వల్ల శుభ ఫలితాలను పొందుతారని అర్చకులు వివరించారు. మధ్యాహ్నం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రాజమండ్రికి చెందిన విజయలక్ష్మి బృందంచే రుక్మిణి కల్యాణం హరికథ కాలక్షేపం ఆలపించారు. సాయంత్రం సంపూర్ణ కోలాట బృందం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు శేషం కిరణ్‌కుమారాచార్యులు, భార్గవాచార్యులు, వేదపండితులు మల్లారు రవికుమార్ శర్మ, నాలదీగల నరసింహాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజచార్యులు, ఆలయ సిబ్బంది శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

దమ్మపేట: పంజాబ్, హర్యానా రాష్ట్రాల సరిహద్దుల్లో నిరవధికంగా రైతులు చేస్తున్న దీక్షపై స్పందించని కేంద్రప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మండలంలోని లింగాలపల్లి గ్రామంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ అనుబంధ రైతు సంఘం జాతీయ కన్వీనర్ కెచ్చెల రంగారెడ్డి మాట్లాడుతూ.. పంజాబ్, హర్యానా రాష్ట్రాల సరిహద్దుల్లో రైతాంగ సమస్యలపై గత 45 రోజులుగా అమరణ దీక్ష చేస్తున్న జగత్‌సింగ్ దల్‌వాలే, ఆరోగ్యం క్షీణిస్తున్నప్పటికీ కనీసం చర్చలకు కూడా కేంద్రం ముందుకు రాకపోవడం శోచనీయం అన్నారు. ఈ విషయంపై రాష్ట్రపతికి విన్నవించడానికి ప్రయత్నించిన ప్పటికీ అపాయింట్‌మెంట్ లభించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రైతు సంఘాలతో కేంద్రం, చర్చలకు రానియెడల దేశ వ్యాప్తంగా ఉద్యమాలను చేయనున్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అమర్లపూడి రాము, గోకినపల్లి ప్రభాకర్, నూపా భాస్కర్, గోనెల రమేష్, తొడెం దుర్గమ్మ, చాపా ముత్యాలరావు, కాకా రమేష్, వాడే గిరి తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతు సంఘం నాయకులు

టైం స్కేల్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

అశ్వారావుపేటరూరల్: కొండ లక్ష్మణ్ ఉద్యాన నర్సరీల్లో పని చేస్తున్న టైం స్కేల్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ విరమణ పొందిన వారికి బెనిఫిట్స్ చెల్లించాలని తెలంగాణ యూనివర్సిటీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు సాలర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక హెచ్ఆర్ఎస్‌లో రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యాన నర్సరీల్లో ఎంతో కీలకపాత్ర పోషించే టైం స్కేల్ సిబ్బంది సమస్యలను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. జీవో 16 ప్రకారం ఖాళీ పోస్టులను టైం స్కేల్ సిబ్బందితో భర్తీ చేయాలని, ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యాలను కల్పించాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శిగా బమ్మిడి దుర్గా, రామారావు, కోశాధికారిగా సత్యనారాయణను ఎన్నికై య్యారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్, ఉమారమేష్, నాగేశ్వరరావు, జగద, రాములు, వరలక్ష్మి, బాషా, రమణ పాల్గొన్నారు.

పేదల జీవనోపాధికి చేయూత



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ తదితరులు

బూర్గంపాడు: సామాజిక సేవలతో పాటుగా పేదల జీవనోపాధులకు చేయూతనందిస్తామని రోటరీ క్లబ్ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి అన్నారు. ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను, కార్యకలాపాలను, అకౌంట్స్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్ భద్రా క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సామాజిక సేవలతో పాటుగా పేదల అభ్యున్నతికి వారి జీవనోపాధులు మెరుగుపరుచుకునేందుకు ఈ క్లబ్ అందిస్తున్న సహకారం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సందర్భంగా 12మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. సారపాకలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వివిధ వృత్తులలో నిష్ణాతులైన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్‌హెడ్ శైలేంద్రసింగ్, రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ భూషణ్‌రావు, రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా అధ్యక్ష, కార్యదర్శులు డీవీఎం నాయుడు, సాయిరామ్, ఐటీసీ ఉన్నతాధికారులు శ్యామ్‌కిరణ్, రాంబాబు, జయంత్‌కుమార్ దాస్, టీఎస్ భాస్కర్, ప్రఫుల్లా, డేవిడ్ అలివర్, రంజిత్, ప్రతాప్, ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

అశ్వారావుపేట: అశ్వారావుపేట విద్యుత్ సబ్‌స్టేషన్ నందు మరమత్తుల కారణంగా అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో నేడు (గురువారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు ఏడీఈ వెంకటరత్నం తెలిపారు. అశ్వారావుపేట, దమ్మపేట, వినాయకపురం, నారంవారిగూడెం ఫీడర్‌ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 గంటల నుంచి 11.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

మణుగూరురూరల్: న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సరం -2025 క్యాలెండర్లను మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ కంభపు సూరిరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు న్యాయసేవలను అందుబాటులోకి తీసుకెళ్లాలని అన్నారు. ప్రతీ ఒక్కరికి చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్, న్యాయవాదులు కిషన్‌రావు, కె.నరసింహారావు, రామ్మోహన్‌రావు, పి.భాస్కర్, విజయ్‌రావు, నాగేష్‌కుమార్, సర్వేశ్వరరావు, చొక్కారావు, పద్మావతి, సంధ్య, శైలజ, కవిత, సరస్వతి, వాసవి పాల్గొన్నారు.

కఠిన చర్యలు తప్పవు

చంద్రుగొండ: అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివరామకృష్ణ హెచ్చరించారు. కోడిపందాలు, పేకాట కేసుల్లో పట్టుబడి నిందితులుగా ఉన్న వారిని బుధవారం బెండోవర్ చేసి వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పేకాట, కోడిపందాలు జూదం ఆడే వారి, నిర్వహకుల సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చేవారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో భాగంగా బుధవారం కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. దేవస్థానం అర్చకులు చిన్నారులకు ప్రశంస పత్రాలు అందజేసి అభినందించారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

దమ్మపేట: అకస్మాత్తుగా వచ్చిన గుండెపోటుతో కూలీ పనికి వెళ్లిన వ్యక్తి, మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మంగాపురం గ్రామంలో చోటు చేసుకోగా, ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని నాచారం గ్రామానికి చెందిన కర్రి రంగారావు (67), మంగళవారం సమీపంలోని మంగాపురం గ్రామానికి కూలీ పని నిమిత్తం వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో అకస్మాత్తుగా గుండెపోటు రాగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమార్తె రాచూరి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నామని ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తెలిపారు.

వాటర్ బాటిళ్ల పంపిణీ

భద్రాచలంఅర్బన్: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ తాజా మాజీ అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్ టీమ్ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవం సందర్భంగా పోలీస్ సిబ్బందికి మంచినీళ్ల బాటిళ్లను బుధవారం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ చేతుల మీదుగా అందజేశారు. బండారు కృష్ణయ్య , గుడిమాసు వెంకట సత్యనారాయణ, రేపాక రాజమనోహర్, శీమకుర్తి మనోహర్, సముద్రాల అనిల్ కుమార్, రేపాక హరినాథ్ తదితరులున్నారు.

స్వీయ నియంత్రణతో ప్రమాదాల నివారణ



అశ్వారావుపేటరూరల్: రోడ్డు భద్రతపై ప్రమాణం చేయిస్తున్న ఎంవీఐ జనార్దన్

అశ్వారావుపేటరూరల్: రోడ్లు దాటే సమయంలో జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు, వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటిండం, స్వీయ నియంత్రణ ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ సూచించారు. బుధవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా అశ్వారావుపేటలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డ ప్రమాదాల కారణంగా గతేడాది దేశం వ్యాప్తంగా 5 లక్షల రోడ్డు ప్రమాదాలు జరగ్గా.. ఈ ప్రమాదాల్లో 1.50వేల మంది ప్రాణాలు పొగొట్టుకున్నారని, అనేక మంది అంగవైకల్యంతో బాధ పడుతున్నారని వివరించారు. అనంతరం విద్యార్థులకు రోడ్డు భద్రతపై వ్యాస రచన పోటీలను నిర్వహించి, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అలాగే విద్యార్థులచేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం హరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజు రోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగం చేస్తే ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడుకోవడం సాధ్యమవుతుందని భద్రాచలం మోటార్ వెహికల్స్ ఇన్స్‌పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య సూచించారు. కూనవరం రోడ్డులోని రవాణ శాఖ కార్యాలయం వద్ద బుధవారం ద్విచక్ర వాహనదారులలో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రమాద సమయంలో తలకు హెల్మెట్ ఉండటం వల్ల తలకు గాయాలు కాకుండా ప్రాణాలు కాపాడుకోవడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలి



కూరగాయల సాగును పరిశీలిస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థుల బృందం

అశ్వారావుపేటరూరల్: ప్రతి విద్యార్థీ వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాల్సిన అవసరం ఉందని అశ్వారావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.అనిత సూచించారు. బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులను బొటానికల్ టూర్‌లో భాగంగా స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ సార్ వ్యవసాయ కళాశాలను సందర్శించారు. ఈ మేరకు కళాశాలలో పుట్టగొడుగుల పెంపకం, కూరగాయాల సాగు, సేంద్రియ సాగు పద్ధతులు, సుగంద ద్రవ్యాల మొక్కలు, అరుదైన వృక్ష జాతి మొక్కలు, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న వివిధ రకాల మొక్కల గురించి వాటి సాగు విధానాలపై కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డి.స్రవంతి, ఎస్.చరిత విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని, వ్యవసాయం అంటే కష్టం కాకుండా ఇష్టం అనే భావనను కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డి.నరసింహారావు, స్థానిక ఎమ్మెల్యే పీఏ నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



ముగ్గును పరిశీలిస్తున్న న్యాయమూర్తి

మణుగూరురూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ కోర్ట్ ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా మణుగూరు మెజిస్ట్రేట్ కె సూరిరెడ్డి హాజరై ముగ్గులను పరిశీలించారు. ఈ పోటీలో న్యాయవాది పద్మావతి ప్రథమ స్థానంలో గెలుపొందగా.. ద్వితీయ స్థానంలో కోర్ట్ సిబ్బంది నిలిచారు. విజేతలకు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అందించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోర్ట్ స్పోర్ట్స్ కార్యదర్శి రుద్ర వెంకట్, న్యాయవాదులు చిర్ర రవి, అంకం సర్వేశ్వరరావు, పద్మావతి, సరస్వతి, సంధ్య, రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐలో..

మణుగూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో బుధవారం ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపల్ బుగు ప్రభాకర్ ప్రారంభించారు. పోటీల్లో భాగంగా విద్యార్థినులు రంగు రంగు ముగ్గులను సుందరంగా తీర్చిదిద్దారు. కళాశాల ప్రిన్సిపల్ పరిశీలించి.. అభినందించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా టీఎస్ జ్యోతిరాణి, సువర్ణ, దేవకరణలు వ్యవహరించగా.. కళాశాల టీఓ జి.రవి, ఏటీఓలు జీవీ కృష్ణారావు, ఏ.నరసయ్య, ఎం.శ్రీనివాసరావు, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బంది రక్తదానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ డిపోలో బుధవారం రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ, లయన్స్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు. డిపో మేనేజర్ తిరుపతితో పాటు ఆర్టీసీ సిబ్బంది, అద్దె బస్సు యజమానులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఆర్టీసీ సిబ్బంది గౌతమీ, వీర వెంకన్న, అద్దె బస్సు యజమానులు రామకృష్ణ, కొండబాబు, శ్రీనివాస్ ప్రసాద్, శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

నిఖార్సైన ఉద్యమ నాయకుడు అజ్గర్

గుండాల: ప్రత్యేకమైన రాజకీయ పరిస్థితులు నెలకొని ఉన్న సమయంలో నికార్సైన కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడిని కోల్పోవడం బాధాకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా గుండాల మండల కేంద్రంలో బుధవారం న్యూడెమోక్రసీ నాయకులు అజ్గర్ దశదిన కర్మల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విలువల్లేని రాజకీయాలు రాజ్యమేలుతున్న తరుణంలో విలువలతో కూడిన నిజాయితీ గల కమ్యూనిస్టు కార్యకర్తలను కోల్పోవడం బాధాకరమని వారిలోటు పూడ్చలేనిదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు రేసు ఎల్లయ్య, ప్రజాపంథ నాయకులు ఈసం శంకర్, వాగబోయిన రమేష్, సాహెద్, కాంగ్రెస్ నాయకులు ఖదీర్, ఊకే బుచ్చయ్య, ఎండి మహమూద్, గడ్డం శ్రీను, తెల్లం రాజు, బచ్చల లక్ష్మయ్య, గంగాధరి వినయ్ కోరం చిన సమ్మయ్య, రవివర్మ, జగదీష్, ప్రణయ్, నాసిర్, మొక్క నవీన్, దశరథి తదితరులు పాల్గొన్నారు.


రేవతికి సన్మానం



కుంజా రేవతిని సన్మానిస్తున్న పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు

దమ్మపేట: ఇటీవలే ప్రకటించిన తెలంగాణ జెన్‌కో అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) ఫలితాల్లో కొలువు సాధించిన మండలంలోని తొట్టిపంపు గ్రామానికి చెందిన కుంజా రేవతి ఈ నెల 7న(మంగళవారం) బాధ్యతలు స్వీకరించారు. తనకు బాల్యంలో విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయుడు, ప్రస్తుతం మొద్దులగూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బండి శ్రీనివాసరెడ్డిని బుధవారం కలసి, ఆశీస్సులు తీసుకున్నారు. ఆ హెచ్‌ఎం, పాఠశాల ఉపాధ్యాయులు ఆమెను శాలువాతో సత్కరించారు. గ్రామస్తులు ఆమెకు అభినందనలు తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మణుగూరురూరల్: సదస్సులో మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

మణుగూరురూరల్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, మాదకద్రవ్యాలను నిర్మూలనకు పాటుపడాలని మణుగూరు సీఐ సతీష్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మణగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, కొత్తచట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సీఐ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, వాహనాలను మితిమీరిన వేగంతో, పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ నడపకూడదని సూచించారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను చీకటిమయం చేసుకోవద్దన్నారు. అలాగే బీఎన్ఎస్, బీఎస్ఎస్ఎస్ వంటి చట్టాల పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మణుగూరు ఎస్సై రంజిత్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండల ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ గణేష్ సూచించారు. బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పోలీస్ అధికారుల పేరుతో వస్తున్న వీడియో కాల్స్‌ని నమ్మొద్దని, కస్టమ్స్ ఆఫీసర్లుగా ఫోన్ చేసినా స్పందించ వద్దని తెలిపారు. డబ్బులు అడిగేందుకు ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నాయని, చట్టాన్ని అమలు చేసే సంస్థలు వీడియో కాల్స్ ద్వారా అరెస్టు చేయవని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్‌లో ఓటీపీ కాని, బ్యాంక్ ఖాతా నంబర్లు కానీ ఎవరికీ చెపొద్దన్నారు. ఒకవేళ ఇలాంటి ఏవైనా మీ మొబైల్ ఫోన్ కు వస్తే వెంటనే స్పందించి పోలీస్ శాఖకు లేదా 1930 నంబర్ కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.